రచన - జనవరి 2002

# శృంగార వాస్తవం

"స్త్రీ పురుష సంయోజనానాకి సంబంధించినంత మేరకు, నా దృష్టిలో ప్రేమకూ, కామానికీ మధ్య సరిహద్దులు గీయడం ఓ రకంగా కష్టమే. ప్రేమ అనే అంతరంగంలోంచి కామం తలఎత్తి చూడ్డమో, లేక అంచుల చివర్నుంచి తొంగి చూడ్డమో జరుగుతుంది. ప్రేమ హృదయావిర్భూతమనీ లేదా మనసులకి సంబంధించినదనీ మడికట్టుకు కూర్చుని, దేహానికి సంబంధించిన కామాన్ని విస్మరించడం చాలా అసాధ్యమైనపని. కామంలేని ప్రేమలో పరిపూర్ణత

లేదు," అన్నాడు శ్రీనివాస్.

"నువ్వన్నది నిజం కావచ్చు. కానీ ప్రేమలేని కామం సర్వసాధారణమే కదా! నా ఉద్దేశ్యంలో నూటికి తొంభై జంటలు ఈ రెండో కోవకి చెందినవే!" అన్నాడు గౌరీపతి.

"నీ మాటా నిజమే. కాని ప్రేమరహితమైన కామానికి కాసిన్ని మెరుగులు దిద్దడానికి, శృంగారచేష్టలనే వాటిని ప్రేమకీ, కామానికీ మధ్య ఇరికిస్తే ఫలితముంటుంది. ఒక్కొక్కసారి శృంగారభావనలు ముందుగా ఉత్పన్నమై, ఆతర్వాత ప్రేమకి పునాదులు వెయ్యడానికి అస్కారముంటుంది. ఏది ఏమైనా, స్త్రీపురుషుల మధ్య అవగాహన అనేది లోపించిన పక్షంలో, వారు జీవితాంతమూ యాంత్రికమైన జీవితానికి, సంఘపు కట్టుబాట్ల పరిధిలో అలవాటు పడిపోగలరేమోకాని, రసవత్తరమైన దాంపత్య జీవనానికి దూరంగానే ఉండిపోతారు!" అన్నాడు శ్రీనివాస్ సిగరెట్ వెలిగిస్తూ.

"కానీ శృంగారం అనే దానికి నిర్వచనం ఏమిటి? అది స్త్రీ చేష్టలకే పరిమితం అనుకొంటాను" అని అనుమానం వ్యక్తం చేశాడు శర్మ.

"అలంకరించుకొన్నా, అర్ధనగ్నంగా ఉన్నా - అర్ధనిమీలిత దృష్టులు సారించినా, అధరోష్ఠమూలాన్ని పంటితో నొక్కి పట్టినా - తడిసిన వస్త్రాల్లో ఉన్నా, తలుపుచాటు నుంచి తొంగిచూసినా - స్త్రీ పురుషుణ్ణి రెచ్చగొడ్తుంది. అదే శృంగార ప్రదర్శన! శృంగార భావన! ఆ క్షణంలో పురుషుడి దృష్టిలో స్త్రీ ఓ శృంగారనాయికే! సందార్భానుసారంగా ఎన్నిరకాల విభజనలు చేసినా పురుషుణ్ణి రెచ్చగొట్టే ప్రతి స్త్రీ ఓ శృంగార నాయికే!" అన్నాడు శ్రీనివాస్ ఓ దమ్ము గట్టిగా లాగుతూ.

"సౌందర్యరాశులైన స్త్రీలకే శృంగార చేష్టలు మరింత ఆకర్షణని తీసుకొస్తాయి. సంసారపక్షంగా ఉన్న స్త్రీలు శృంగార చేష్టలు చేస్తే శోభగా ఉండదు!" - అంతవరకూ మౌనంగా ఉన్న నిరంజన్ అన్నాడు.

"అందమున్న చోటే శృంగారముందనుకొంటే, అలా భావించే హక్కు స్త్రీకి కూడా ఉంటుంది. ఇదే మాట స్త్రీ అంటే పురుషుడి అహం దెబ్బ తింటుంది. ఈ విషయంలో చతుష్పాదులూ. విహంగాలూ మానవుల కంటే నయం!" అన్నాడు శ్రీనివాస్.

"పెద్ద పదాలు వాడేస్తున్నావ్!" అన్నాడు నిరంజన్ బీరుని ఖాళీ గ్లాసుల్లో నింపుతూ.

"మగసింహం జూలుతో, ఏనుగు దంతాలతో, ఆంబోతు మూపురంతో, నెమలి పింఛంతో - యిలా చెప్పుకొంటూ పోతే ఎన్నో దేహాకర్షణలతో ఉంటాయి. ఆడజాతి జంతువులూ, పక్షులూ, మగజాతి' వాటిని ఆకర్షించడానికి నానా తిప్పలూపడ్తాయి. మానవజాతి ప్రవర్తన దీనికి విరుద్ధం!" అన్నాడు శ్రీనివాస్.

"పూర్తిగా విరుద్ధం అంటే ఒప్పుకోను. పశుపక్ష్యాదులలో మగజాతికి అందాన్నిచ్చిన ప్రకృతి, మానవజాతిలో స్త్రీకి అందాన్ని ప్రసాదించింది. అయినా స్త్రీల అలంకార ప్రియత్వం పురుషుణ్ణి ఆకర్షించే ప్రయత్నమే కదా?" అన్నాడు గౌరీపతి.

"మన శ్రీనివాస పండితుడు చేప్పేదేమిటంటే మానవజాతిలో స్త్రీని ఆకర్షించడానికి పురుషుడు తంటాలు పడక తప్పదు. కానీ ఉన్న చిక్కల్లా ఏమిటంటే అన్ని మగ నెమళ్ళకీ పురులున్నట్టుగా, అందరు స్త్రీలకీ అవయవాల పొందిక ఉండదు! అలాగే అందరు మగాళ్ళూ అందాలరాముళ్లూ కారు! అందుకనే నేనసే మాట - శృంగారమయ జీవితం అందరి అనుభవంలోకి రాదు. అది అందమైన జోడీలకే సొత్తు! ఇది నిరంజన్ వేదసూక్తి, జ్ఞాపకం ఉంచుకోండి!" అన్నాడు నిరంజన్.

"మరి మిగిలిన వారి గతి?" - గౌరీపతి ప్రశ్నించాడు ఓ గుక్కెడు బీరు తాగి.

"దేహతాపాన్ని చల్లార్చుకోవడం కోసం చీకటి పురాణమే?" అన్నాడు శర్మ.

"అక్కడే మీరు పొరబడుతున్నారు. సౌరతములోని దివ్యానుభూతికి అందంతో నిమిత్తం లేదు. తన గొడవే చూసుకోకుండా స్త్రీకి కూడా ఆ దివ్యానుభూతిని కలిగించడానికి పురుషుడు అవగాహనతో ప్రవర్తిస్తే ఆ సంగమం పరిపూర్ణంగా ఉంటుంది. స్త్రీలు పురుషుణ్ణి దృక్కులతో ఉద్రిక్తుణ్ణిచేస్తే, పురుషుడు స్త్రీలని స్పర్శతో అలరించగలడు. అందుకనే మన వాత్స్యాయనుడు చెప్పిన నఖ-దంతక్షతాలూ, అలింగన-చుంబనాదులూ, అధరామృతపానాలూ, అంగాంగస్పర్శలూ శృంగారప్రక్రియలే. వీటికి చీకటీ, వెలుగులతోటీ, అందంతోటీ సంబంధం లేదు!" అన్నాడు శ్రీనివాస్ బీరు గ్లాసు అందుకుంటూ.

"అదుగో, 'అధరామృతపానం' అనే ఓ ఊహాజనితమైన పదాన్ని ప్రస్తావించావు. స్పర్శ కామాన్ని యిబ్బడి చేస్తుంది. ముద్దు అందులో ఓ ప్రక్రియ. అంతవరకూ బాగానే ఉంది. కానీ, అధరామృతాన్ని గ్రోలి అని కవులు రాసి చస్తారే, దాన్ని గురించి ఆలోచించండి! ఒరేయ్ మీరు నిజం చెప్పండి. 'అధరామృతపానం'లో లభించిన సుఖమేమిటో? లాలాజలాన్ని పెదవుల తేనియలనుకొంటూ మభ్యపెట్టుకోవడం తప్ప! అమృతం అంటే ఆ సీసాలో ఉన్నది. ఈ గ్లాసుల్లో ఉన్నది!" నిరంజన్ బీరు గ్లాసు ఎత్తి చూపిస్తూ అన్నాడు.

"నువ్వన్నది నిజమేరా? మనం వేడిలో చేసే పనులకిలా ముసుగులు వేసుకోవడం తప్ప మరేమీ కాదు!" అన్నాడు శర్మ.

"శాస్త్రాన్ని ఉన్నదున్నట్టు చెప్పే మానవుడు, తన జీవితాన్ని రంగుటద్దాలలో చూడకనూ తప్పదు, అందుకు కొన్ని ప్రయత్నాలూ చెయ్యకనూ తప్పదు. లేకపోతే జీవితం నిస్సారంగా అనిపిస్తుంది. చంద్రవదన, పద్మాక్షి, మీనాక్షి, కామాక్షి, నీలమేఘశ్యాముడు, మలయమారుతం, గ్రీష్మతాపం ఇత్యాది విశేషణ పూర్వపద కర్మధారయాలూ. ఉపమానాలంకారాలూ కవుల భావుకతకు నిదర్శనాలు. అంతంతమాత్రపు విషయాల్ని అందమైన దృక్కోణాలలో చూపించడానికి పడే ప్రయాసలు! అలాగే ప్రగాఢ చుంబన ప్రక్రియాజనితమైన రసాన్ని అస్వాదించడాన్ని నిష్ఠీవన పానం అంటే, లాలాజలాస్వాదన అనడం కంటే 'అధరామృత పానం చేయడం' అనడంలో రసజ్ఞత ఉంది కాని, తప్పేమీ లేదు! ఏమంటారు?" అన్నాడు శ్రీనివాస్ గ్లాసు నింపుకొంటూ.

"అనడానికేముంది? వెధవది మాటల్లో కోటలు కట్టిపారేస్తావు! ఇంతకీ నీ గోల ఏమిటంటే స్త్రీ శృంగార చేష్టలు పురుషుణ్ణి స్పర్శ లేకుండానే వివశుణ్ణి చేస్తాయి. పురుషుడు కామకేళితో

స్త్రీకి ఆనంద శిఖరాన్ని చూపించాలి! అనుకోవడానికి బాగానే ఉంటుంది కానీ, నిత్యజీవితంలో ఇదెంత వరకూ సాధ్యమనేదే ప్రశ్న!" అన్నాడు గౌరీపతి.

బేరర్ వచ్చి 'శామ్సన్ అండ్ డిలైలా' వీడియో సినిమా మరికొన్ని నిముషాల్లో క్లబ్ హాల్లో మొదలవుతుందని చెప్పడంతో, గ్లాసులు ఖాళీ చేసి అలనాటి శృంగారతార హెడిలామర్‌ని బుల్లితెర మీద చూడ్డానికి అందరూ లోపలికి దారి తీశారు.

❁ ❁ ❁

వారం తర్వాత, శనివారం సాయంత్రం శ్రీనివాస్ వెళ్ళేసరికి, లాన్‌లో గులాబీ మొక్కల పక్క కుర్చీల్లో కూర్చుని బీరు సేవనంలో ఉన్నారు, మిగిలిన ముగ్గురు మిత్రులూ. భుజానున్న ఖద్దరు సంచీని జాగ్రత్తగా పక్కన పెట్టి, శ్రీనివాసూ ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"వచ్చాడుకదా, నీ కసి తీర్చుకో!" అన్నాడు గౌరీపతి.

"నా మీదా? నేనేం హాని ఎవరికి చేశాను?!" శ్రీనివాస్ తెల్లబోతూ అడిగాడు.

"ఏం హాని చేశావా? నా కణత మీదనున్న బాండ్‌ఎయిడ్ పట్టీ కనబడ్తోందా? ఆ పట్టీ కిందనున్న దెబ్బ నీ మూలానే తగిలింది!" అన్నాడు నిరంజన్ కాస్త కోపంగా.

"కారణం చెప్పకుండా కారాలూ, మిరియాలూ నూరితే నేనేం చెయ్యగలను? నేనే విధంగా నీకు హాని కలిగించానో నా కర్థం కావటల్లేదు! ఒకవేళ నాకు తెలియకుండా నావల్ల అపకారమేదైనా జరిగితే ప్రాయశ్చిత్తం చేసుకొంటాను. ఇదిగో, యిది IMFL కాదు, అసలైన సిసలైన స్కాచ్!" అన్నాడు కిందపెట్టిన బాగ్‌లోంచి షివాస్ రీగల్ బాటిల్ బల్ల మీద పెడ్తూ శ్రీనివాస్.

వెంటనే నిరంజన్ మూడ్ మెత్తబడిపోయింది. శర్మ గట్టిగా విజిల్ వేసి బేరర్‌ని పిలిచి సోడాలకీ, మంచుముక్కలకీ, ఉల్లి పకోడీలకీ ఆర్డరిచ్చేశాడు. 'అతగాడు వాటిని తీసుకొచ్చేలోగా ఈ బీరు తాగేస్తే తర్వాత నిదానంగా విస్కీ సేవించవచ్చు. ఈలోపుగా నీ కథనం మొదలుపెట్టు. శ్రీనివాసు వస్తేనే కాని దెబ్బెందుకు తగిలిందో చెప్పనన్నావుగా?" అన్నాడు.

"మరి నేను పూర్తిగా చెప్పే వరకూ అడ్డుతగలకూడదు, నవ్వకూడదు. మౌనంగా వినాలి!" నిరంజన్ కండిషన్లకి అందరూ తలలూపారు. నిరంజన్ గొంతు సవరించుకొని మొదలు పెట్టాడు.

"మొన్న బుధవారం మా శ్రీమతి తమ్ముడి పెళ్ళికని, గోదావరి గట్టుకు దగ్గరగా ఉన్న ఓ పల్లెటూరు వెళ్ళాల్సి వచ్చింది. ఆ ఊరి పేరు సింగారపేట. రాత్రి పెళ్ళితంతూ, భోజనాలూ అవీ పూర్తయ్యేసరికి పన్నెండు దాటింది. విడిదికి వెళ్ళేసరికి నేల మీద పరచిన జంబుఖానాల మీదా, చాపల మీదా, పిన్నా, పెద్దా అంతా ఆదమరచి నిద్రపోతున్నారు. ఎక్కడైనా ఓ దిండూ, దుప్పటి లాంటివేమైనా దొరుకుతాయేమోనని చూశాను. కాని లాభం లేకపోయింది. శ్రీమతి కోసం చూశా. ఆ పడుకున్న శాల్తీల్లో కనబడలేదు. ఆడపడుచు హోదాలో పెళ్ళివారింట్లోనే ఏ మడత మంచం మీదో హాయిగా పడుకొని ఉందనుకొంటూ, గౌరవాలన్నీ ఆడపడుచుకే కానీ ఆడపడుచు మొగుడికి కాదనుకొంటూ గోదావరి గట్టుకు దారితీశాను.

"గట్టు దిగి, ఇసుక తిన్నెల మీదుగా నడచుకొంటూ నీటివైపు నడవసాగాను. పుచ్చ పువ్వులా

వెన్నెల కాస్తోంది. అక్కడక్కడా ఉన్న రెల్లు దుబ్బల నీడలు ఆధునిక చిత్రకారుడి చిత్రాల్లా ఉన్నాయి. వంపులు తిరిగిన నీటి అంచులు వెండి జరీ అంచుల్లా ధగధగా మెరిసిపోతున్నాయి. చిన్నగా వీస్తున్న గోదావరి గాలి చలిచలిగా, వెచ్చవెచ్చగా శరీరానికి పులకింతలు పెడ్తోంది. అత్యంత మనోహరమైన ఆ ప్రకృతిని చూసి ఆనందిస్తూ నీటికి కాస్త దూరంలో ఓ ఇసుక దిబ్బ మీద కాళ్ళు జాపి కూర్చున్నాను.

"ఉన్నట్టుండి దిగువగా నీటి అంచుల్నించి, రెల్లు దుబ్బల చాటునుంచి, నెత్తి మీద ఓ మూట పెట్టుకొని నేనున్న వైపే వస్తున్న ఓ ఆకృతి కనబడింది. ఏ దెయ్యమో, భూతమో అనుకొని కాస్త ఒళ్ళు జలదరించిన మాట వాస్తవం. దగ్గరగా వచ్చిన తర్వాత, ఆ ఆకారం ఓ స్త్రీదని తెలిసింది. నెత్తిమీదనున్న మూట నీడల్లో ముఖకవళికలు తెలియలేదు. ఆ స్త్రీ కూడా నన్ను చివరి క్షణంలో చూసి, ఒక్కసారిగా తొట్రుపడి, కాళ్ళు తడబడి ముందుకు పడింది. ఆమె తల మీది మూట తలకు కాస్త దూరంలో పడగా, ఆమె నా మీద పడింది. అప్పుడు తెలిసింది. ఆమె నిండు యవ్వనంలో ఉన్న పల్లెపడుచని.

"నేను నెమ్మదిగా లేచి కూర్చోడానికి ప్రయత్నించాను. ఆ ప్రయత్నంలో మా శరీరాలు మరింత దగ్గరయ్యాయి. ఆమె భుజాల మీద చేతులు వేసి, నెమ్మదిగా దూరంగా తోసి నేను లేచి నిల్చున్నాను. జబ్బలు పట్టుకొని మోకాళ్ళ మీద నిలబడి ఉన్న ఆమెని లేవనెత్తాను. ఆమె నాకా క్షణంలో దిగివచ్చిన దేవతాలా కనిపించింది. నల్ల చలువ రాయిలా నిగనిగలాడ్తున్న చెక్కిళ్ళ మీదనున్న స్వేదబిందువుల్లో చంద్రుడు ప్రతిబింబిస్తుంటే, ముత్యాలు జాలువారుతోన్నట్టని పించింది. రతీదేవి రంగెలా ఉంటుందో నాకు తెలియదు కాని, కృష్ణ వర్ణమైనా ఆమె అత్యంత ఆకర్షణీయంగా ఉంది. ఆమెనలా చూస్తున్నంతసేపూ నా చేతులామె భుజాల మీదే ఉండిపోయాయి. వాటిని తొలగించడానికి ఆమె ప్రయత్నించలేదు కూడాను! ఆమె చేష్టల్ని ఏమంటారు?... నువ్విదివరకోసారి చెప్పావు జ్ఞాపకం రావట్లేదు...." నిరంజన్ ఆగాడు.

"విహ్వలం," అన్నాడు శ్రీనివాస్ ముక్తసరిగా.

"అదే, అదే - విహ్వలంగా భావించాను. ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. నేను నెమ్మదిగా ఆమెని బాహువుల్లో బంధించి, గాఢంగా అదుముకొన్నాను. నువ్వు దంచే శృంగారోపన్యాసాలు మదిలో మెదిలాయి. నెమ్మదిగా ఇసుకలో కూర్చుని ఆమెను ఒడిలోకి లాగాను. ముంగురులు సవరిస్తూ, నుదుటి మీద చుంబించాను. ఆమె శరీరాన్ని స్పృశిస్తూ వివరాలు సేకరించాను. పేరు పంకజం, భర్తృవిహీన. ఆ ఊరి పెద్ద కామందు కొడుకు హైదరాబాద్ వెళ్ళవలసి వస్తే అతని భార్య బట్టలు వేసి, అర్జంటుగా ఉతికి, ఇస్త్రీ చేసి మర్నాడు ఉదయానికల్లా తీసుకురమ్మని పంకజం తండ్రికి పురమాయించింది.

"అయితే తండ్రి పూటుగా నాటుసారా లాగించి ముసుగుతన్నాడు. తల్లి రోగిష్టిది. తమతోనే ఉంటూన్న అక్కా బావా పక్కనే ఉన్న పట్నానికి సినిమా చూడ్డానికని పోయారు. ఆ బట్టల సంగతి ఎవ్వరికి పట్టలేదు. సకాలంలో బట్టలందకపోతే పెద్ద కామందు కొడుకు సౌమ్యురాలైన

భార్య మీద రంకెలు వేస్తాడు. ఆమె మాటపడకూడదని, పంకజం రాత్రి పూట బట్టలు పట్టుకొని ఉతకడానికి రేవు కొచ్చింది.

"వేళ్ళతో కనుబొమల్నీ, నాసికాగ్రాన్నీ, పెదవుల్నీ స్పృశించాను, మెడ మీదగా, భుజాల మీదుగా స్పృశిస్తూ కటి ప్రదేశంలో కితకితలు పెట్టాను. పంకజం నా చేతులు తీసుకొని తన గుండెలకు హత్తుకొంది. ఆమెను బిగికౌగిలిలో బంధించి పెదవుల మీద చుంబించాను. నువ్వు చేప్పే అధరశీధువుని గ్రోలేలోగా, ఒక్కసారిగా విదిలించుకొని నీటి వైపు పరుగెత్తింది. నేనూ వెనుకగా పరుగెత్తి పిక్కల్లోతు నీళ్ళలో ఆమెనందుకొన్నాను. ఇద్దరమూ కలిసి నీటిలో పడ్డాం.

"ఆమె నా మీద నీళ్ళని చల్లుతూ కిలకిల నవ్వింది. ఆ నవ్వే పెదవుల్ని నా పెదవులతో మూశాను. ఆమె నన్ను మాధవీలతలా పెనవేసుకుపోయింది. చేతుల్లో ఆమె నెత్తుకొని, ఒడ్డు చేరి ఇసుకలో కుదేశాను. ఆనందంగా ఇసుకలో దొర్లింది. తడి వంటి మీద అంటుకొన్న ఇసుక రేణువు లామెకో వింత సోయగాన్నిచ్చాయి. నేను పక్కనే కూలబడి ఆమె చీర ముడిని సడలించడానికి ప్రయత్నించాను, చెయ్యి పట్టుకొని నన్ను గట్టు మీద నున్న గంగరావి చెట్ల నీడల్లోకి లాక్కుపోయింది చంద్రుడు చూస్తాడంటూ. ఓ చెట్టు చాటున నన్ను కరుచుకుపోయింది.

"సరిగ్గా అప్పుడే నా మెడ మీద పడిందో దెబ్బ! ఎవరో నన్ను బలంగా జబ్బ పుచ్చుకొని లాగి తోశారు. అక్కడే ఉన్న ఓ రాతికి తల తగిలి కణత చిట్లింది. జేబులోంచి తడి రుమాలు తీసి కణతని నొక్కిపట్టి అలానే కూర్చుండి పోయాను.

'ఇంటికి పద పాడుదానా! నీ సంగతి నీ అయ్యతో చెప్పి చర్మం చీరించకపోతే నా పేరు రంగడు కాదు!' అన్నాడా రంగడి పేరు గలవాడు.

'ఎందుకలా నోరు చేసుకొంటావు? అక్క మెళ్ళో తాళి కట్టి ఇద్దరు పిల్లల తండ్రివైయ్యుండీ కూడా, నా మొగుడు చచ్చిన మర్నాటి నుంచీ నువ్వు నా కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నావు! ఇంతవరకూ నన్ను నేను అదుపులో ఉంచుకొంటూ వచ్చాను. ఈ రోజున అనుకోకుండా ఈ పట్నంబాబు చేయి తగలడంతో నేనిప్పుడు మండిపోతున్నాను. నువ్వింటికెళ్ళి గొడవచేస్తే రచ్చకెక్కడం తప్ప ప్రయోజనం లేదు. కానివాళ్ళతో కులికే బదులు, అయిన వాళ్ళతో ఏడ్చి అక్క చాటున పడుండడమే మేలు! ఆ పట్నంబాబుదీ తప్పు లేదు. నాదీ తప్పు లేదు. అనుకోకుండా జరగబోయిన దానికి అనుకోకుండా నీ కంట పడ్డం కూడా మంచిదే అయింది! ఆయన జోలికి పోకు. ముందు నా వంట్లో వేడి చల్లార్చు! లేకపోతే నాకు గోదారే గతి!' అన్న పంకజం మాటలు విని నా తల దిమ్మెక్కిపోయింది. గొడవ పడకుండా నన్నూ, తననీ రక్షించుకోవడానికి ఉన్న ఆ ఒక్క మార్గాన్నీ ఒక్క క్షణంలో ఎంచుకొన్న పంకజం నిజంగా చాలా గొప్పది.

'నా సామిరంగా, అదీ అలాగుండాలి! కాస్తంత ముందుగా వచ్చాను కాబట్టి సరిపోయింది కానీ, ఈ రాత్రి ఎంత ఘోరం జరిగిపోయుండేది?!' అంటూ, పంకజాన్ని అమాంతంగా ఎత్తుకొని భుజం మీద వేసుకొని మరింత చీకట్లలో కలిసిపోయాడు.

"నేను మళ్ళీ గట్టు దిగి, బట్టల కంటుకొన్న ఇసుకా అవీ పోయేటట్టు స్నానం చేసి,

తడిబట్టలతో, తలకి రుమాలు కట్టుతో విడిదింటికి వెళ్ళాను, శ్రీమతి నేనేమైపోయానా అని ఎదురు చూస్తోంది. చోటు లేక గోదావరి ఇసుక తిన్నెల మీద పడుకొందామని వెళ్ళి, ఉత్సాహం చంపుకోలేక స్నానం చెయ్యడానికి నీళ్ళలో దిగి, కాలు జారి దెబ్బ తగుల్చుకొన్నానని ఓ చిన్న అబద్ధం చెప్పాను. ఆ ఊళ్ళో వేరే డాక్టరు లేకపోవడం మూలాన, వాళ్ళకు తెలుసున్న ఓ కాంపౌండరు గాయం శుభ్రం చేసి, రెండు కుట్లు వేసి ఈ పట్టీ అంటించాడు.

"వెధవ బోడి సలహాలూ నువ్వూను! శృంగార రసాభూతీ, అదీ ఇదీ అంటూ....." నిరంజన్ ఇంకా ఏదో అనబోతుండగా శ్రీనివాస్ అడ్డుకొని అన్నాడు.

"ఆగు, నువ్వనబోయేది నాకు తెలుసు! కాని నన్ను రెండు విషయాలు చెప్పనివ్వు. మొదటిది యాదృచ్ఛికమైన ఓ సంఘటనలో అత్యంత మనోహరమైన ప్రకృతి అపరిచితులైన మీ ఇద్దరి మధ్యా తీక్షణమైన ఆకర్షణ కలగజేసి, శృంగార రసోత్పాదనకి నాంది పలికింది. పర్యవసానం ఏమైనా, నీకు శృంగార రసానుభూతి కలిగిందని నీ మాటలూ, వర్ణనలూ చెప్పకనే చెబుతున్నాయి. పంకజం అనే ఆమె కూడా ఆ సంఘటన తర్వాత నిద్రాణితమైన కోరికలు చెలరేగి, నిర్దిష్టమైన ఓ మార్గాన్ని ఎన్నుకొంది. ఆమెకు నువ్వు చేసిన మహోపకారమది!

"ఇకపోతే రెండవది, నువ్వు ఓ దారమ్మట వెళ్తున్నావు. పక్కనే ఉన్న తోటలో ఓ చెట్టు నున్న దోర బంగినపల్లి మామిడికాయ నీ చేతి కందేటట్లుగా కనబడింది. ఆశకు లోనయ్యావు. అప్పుడేం చెయ్యాలి! వెంటనే దాన్ని కోసి, కొరుక్కుతింటూ వెళ్ళిపోవాలి. లేదా సంచీలో వేసుకొని తీసుకొనిపోవాలి. అలా కాకుండా ఆ చెట్టు నీడనే రుమాలు పర్చుకొని కూర్చుని, పాకెట్ నైఫ్‌తో తొక్కలు తీసి, ముక్కలు చేసుకొని తిందామని ప్రయత్నిస్తే తోటమాలి కంటబడకమానవు! నీ విషయంలో జరిగిందిదే! సమయోచితంగా సలహాలు ఉపయోగించుకోవాలి కానీ, వీలుకానిచోట శృంగారం చేస్తే వీపు చిరుగుతుంది!" అన్నాడు శ్రీనివాస్ కూల్‌గా.

ఐసు గడ్డలు వేసిన విస్కీ గ్లాసులందించాడు శర్మ. అందిస్తూ అన్నాడు – "నిరంజన్! మనవాడు తిరిగి నీకే ఎసరు పెట్టాడు! ఆలస్యం అమృతం విషం – అది నీ విషయంలో జరిగింది. ఈ స్కాచ్‌క్కూడా ఆ గతి పట్టించొద్దు!"

నెమ్మది నెమ్మదిగా, అపురూపంగా ప్రతి సిప్‌నీ ఎంజాయి చేస్తూ తాగసాగారు. జన్మానికో శివరాత్రి మరి! పకోడీల ప్లేటూ, సోడా సీసాలూ, ఐస్ బకెట్టూ, విస్కీ బాటిలూ ఖాళీ అవసాగాయి. స్వాధీనంలో ఉన్న అందమైన మత్తు వారి నావహించసాగింది. గౌరీపతి కాస్త తటపటాయించి, "మీరు నవ్వనంటే ఓ విషయం చెబ్తాను, నిరంజన్ వ్యవహారం కన్నా అంతరంగికమే అయినా, శృంగార రాగసాధనలో అపశృతులు పలుకుతాయన్న సంగతి చెప్పదల్చుకొన్నాను," అన్నాడు.

"దానికేం మహారాజులా చెప్పు! యింతకూ నీకూ ఏదైనా అనుభవం జరిగిందా? ఈ శ్రీనివాసుడేనా ప్రేరకుడు?" అన్నాడు నిరంజన్.

"నీలాంటి పెద్ద అనుభవం కాదుకాని, ఓ చిన్న తమాషా జరిగింది. మొన్న పున్నమి రోజు బుధవారం సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికిపోతూ, రెడ్‌సిగ్నల్ రావడంతో క్రాస్‌రోడ్ జంక్షన్లో

కారాపినప్పుడు, ఓ పదేళ్ళ పిల్ల కారు కిటికీ దగ్గరకొచ్చి మల్లెపూల దండలు కొనమని బ్రతిమలాడింది. హఠాత్తుగా పెళ్ళికి వెళ్ళిన తల్లిదండ్రుల సంగతీ, మనవాడి ప్రబోధనల సంగతీ గుర్తుకొచ్చి పది రూపాయలిచ్చి అయిదు దండలు కొన్నాను. తలుపు తీసిన శ్రీమతి, చేతిలో ఉన్న మల్లెదండల్ని చూసి ముందుగా తెల్లబోయి. తర్వాత మందహాసం చేసింది. కాఫీ తాగుతూ మనసులోనిమాట చెప్పేశాను, తన తలకు రాసుకొనే జాబాకుసుమ్ నూనె జిడ్డుపోయేలా షాంపూతో తలస్నానం చేసి, హెయిర్ డ్రైయర్‌తో తలారబోసుకొని, వదులుగా జడ వేసుకొని, తెల్లచీర కట్టుకొని, మల్లెపూలు పెట్టుకొని రాత్రి డాబా మీదకు రావాలని. ససేమిరా కాదంది. చివరికెలానైతేనేం ఒప్పించాను.

"ఆ రాత్రి డిన్నర్ ముగిసిన తర్వాత నేను శుభ్రంగా స్నానం చేసి, సిల్కు లాల్చీ, పైజామా ధరించి, ఆరుబయట డాబా మీద ఆకాశమనే పందిరి కింద – మరింత అందంగా చెప్పాలంటే వెన్నెల అనే షామియానా కింద – పడక్కుర్చీ వేసుకొని కూర్చున్నాను. అరడజను చెక్కపొడి పొట్లాలు నమిలి, నాలుగైదు సిగరెట్లు తగలెట్టిన తర్వాత శ్రీమతి డాబా గుమ్మం దగ్గర ప్రత్యక్షమైంది. మల్లెల వాసన గుబాళించింది. వెన్నెల అహ్లాదంగా ఉంది. దగ్గరగా రమ్మని సైగ చేశాను. చుట్టూ ఉన్న నాలుగైదు అంతస్తుల భవనాల్నీ, ఆకాశంలో చంద్రుణ్ణీ చూపించింది. అప్పటిక్కాని నాకు తట్టలేదు. పట్నవాసంలో డాబాలు బట్టలారేసుకోడానికీ, వడియా లెండపెట్టుకోడానికీ తప్ప మరెందుకూ పనికిరావని! ఉసూరుమంటూ డాబా దిగి, గదిలో అడుగు పెట్టాను. ఇంట్లో మరింక ఎవరూ లేరన్న యిదితో తలుపు వెయ్యలేదు.

"శ్రీమతిని నిలువుటద్దం ముందు నిలబెట్టాను. నడుము చుట్టూ చేతులు వేశాను. మెడ మీద పెదవులతో స్పృశించాను. పమిట తొలగించే ప్రయత్నంలో ఉండగా, ఒక్క ఉదుటున వెళ్ళి గది తలుపులు మూసి, లైటు ఆర్పేసింది. 'సరసాలు చాలు కాని ఇలా వచ్చి పడుకోండి. కట్టిన బట్టలు విప్పడానికే అయితే ఆ చీర, ఈ జాకెట్టూ అని ప్రాణాలు తియ్యటమెందుకు? పెట్టిన పూలు నలగడానికి అయితే ఆ పూలూ, ఈ పూలూ అన్న ఎంపికెందుకు?!' అన్న శ్రీమతి మాటలు విని సమాధానం దొరక్క నేనూ మంచం చేరాను. తర్వాత చీకటి, షరా మామూలే!" అని ముగించాడు గౌరిపతి.

"స్త్రీ ఎంత చక్కగా అలంకరించుకొని ఆకర్షణవంతంగా తయారవుతుందో, అంత త్వరగానూ దుస్తుల్లోంచి బయటపడవలసివస్తుంది. తెల్లచీరలోనూ, మల్లెపూలలోనూ ఉన్న మహత్యమదే. కానీ నువ్వన్న ఒక మాట అక్షరాలా నిజం. శృంగారసాధనకి ఏకాంతం చాలా అవసరం!" అన్నాడు శ్రీనివాస్.

"ఏకాంతం సంగతి ఆ కామేశ్వరుడెరుగును కాని, అలి సహకారం అవసరం! ఒరేయ్, నువ్వెన్నను – కాని సరసాలు గడసానితో కానీ కట్టుకొన్నదానితో కుదరవు!" అన్నాడు గౌరీపతి.

"అదీ నిజంకాకపోవచ్చు. మా మేనేజింగ్ డైరెక్టర్ ముంబయ్ నుంచి వచ్చిన కొన్ని కంపెనీల ప్రతినిధుల గౌరవార్థం మొన్ననో ఫంక్షన్ ఏర్పాటు చేశాడు. మా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు

అతిగుంభనంగా ఏర్పాట్లు చేసిన ఫలితంగా కొంత మంది కాల్‌గర్ల్స్ ఆ ఫంక్షన్లో కలిసిపోయారు. 'ఆరు వందల కోట్ల రూపాయల బిజినెస్ కోసం ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా?' అంటాడు మా పి.ఆర్.ఓ.. అతిథ్యమిచ్చేవాడు కూడా కొన్ని అతిథిసత్కారాలని పొందడంలో అన్యాయం లేదని వాదించే ఫిలాసఫీ అతగాడిది. బలవంతంగా ఒకామెను నా వైపు మళ్లించాడు. ఆ కబురూ ఈ కబురూ చెప్పి, ఒంటరిగా ఉంటున్నానని తన అపార్టుమెంటుకి తీసుకుపోయింది. తిన్నగా తీసుకుపోయి పడగ్గదిలో కూర్చోపెట్టి, 'ఇప్పుడే వస్తాన'ని చెప్పి పక్కగదిలోకిపోయి నిముషంలో గది గోడలే అంబరాలుగా తిరిగి వచ్చింది.

"ఇంకా అలా కూర్చుంటే ఎలా? పన్నెండింటికి లేక్‌రాక్ హోటల్లో నా సినిమా స్టార్ బాయ్‌ఫ్రెండ్‌ని కల్సుకోవాలి, బెటర్ బి క్విక్!" అంది.

"ఆమె మాటలు నాకు చాలా వెగటుగా తోచాయి. 'కష్టమర్స్ పట్ల మీరు ప్రవర్తించే తీరెలా ఉంటుందో పరిశీలించమని, మీ మీద వేలు తగలబెట్టిన మా కంపెనీ నన్ను పరిశీలకుడిగా పంపింది. నేనొచ్చిన పని అయిపోయింది. నువ్వు నిశ్చింతంగా, వెళ్ళి నీ బాయ్‌ఫ్రెండ్‌ని కలుసుకో! అని ఓ పచ్చిఅబద్ధమాడి, తలుపు తెరుచుకొని బయటపడ్డాను" అన్నాడు శర్మ.

శ్రీనివాస్ ఏదో అనబోయాడు. అతగాడ్ని అడ్డుకొని, "ఒరేయ్, నువ్వింక విశ్లేషణలు చెయ్యొద్దు. వివరణలు చెప్పొద్దు. పెళ్ళికి ముందు ప్రేమా - దోమా, శృంగారమూ - గింగారమూ ఏవో కాస్త వాస్తవంగానూ, కాస్త ఊహాజనితంగానూ ఉంటాయేమో కానీ, సంఘమిచ్చే వివాహమనే ఆమోదముద్ర లభించిన తర్వాత, ఆకలి లాంటిదే అయిన ఈ 'సెక్సువల్ బైలాజికల్ అర్జ్' అట్టే ప్రయత్నం లేకుండా కాస్త అటూ యిటూగా స్త్రీ పురుషులకి తీరడం జరిగిపోతుంది. లేకపోతే ఈ భూగోళం మీద ఇన్ని కోట్ల జనాభా ఎలా తగలడిందని?' అన్నాడు నిరంజన్ ఖాళీ స్కాచ్ బాటిల్‌ని ఎత్తి చూస్తూ.

"అవున్రా! 'డౌన్ టు ఎర్త్ రియాల్టీ'గా ఆలోచిస్తే ఇదంతా ఓ రకమైన మిథ్య! అందుచేత ఈ శృంగార రసానుభూతిని కాల్పనిక జగత్తులో విహరించే కవుల కలాలకీ, చిత్రకారుల కుంచెలకీ, శిల్పకారుల ఉలులకీ, సినిమా దర్శకుల భావుకతకీ, కెమెరా కోణాలకీ పరిమితంచేసి, స్త్రీకి కూడా సృష్టికార్యంలో తృప్తినిచ్చే భావప్రాప్తి కలుగచెయ్యడానికి పురుషుడు ప్రయత్నిస్తే చాలు! ఇంటికీ, వంటికీ మంచిది! దీనికి వెల్తురూ అక్కర్లేదు, వెన్నెలా అక్కర్లేదు - చీకటే చక్కగా ఉపయోగిస్తుంది. స్త్రీ సిగ్గుని దాచడానికి చీకటే సాధనం! ఏమంటావ్ శ్రీనివాస్?" అన్నాడు శర్మ.

"ఏమంటాను, ఏమనగలను? నేను తెచ్చిన విస్కీ మీ మనసుల్ని తెరిపించి వాగించింది. నా నోరు మూయించింది!" అన్నాడు శ్రీనివాస్ లౌక్యంగా. మండువేసవిలో పెళ్ళిచేసుకొని, మొదటి శీతాకాలం రాకమునుపే శ్రీమతిని అయిదో నెల కడుపుతో పుట్టింటికి పురిటికి పంపిన శ్రీనివాస్, రాబోయే జీవితకాలంలో ఎంతటి శృంగారమయ జీవితాన్ని గడపగలడో చూడాలి మరి! ఎందుచేతనంటే శ్రీనివాస్ శ్రీమతికి సిగ్గు ఎక్కువే!